సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 7 । మార్చి । 2024



పగిడిద్దరాజు జాతర ప్రారంభం

మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుడు పగి డిద్దరాజు జాతర గుండాల మండలం యాపలగడ్డలో ఘనంగా ప్రారంభమైంది. 8లో



..అంతర్జాతీయస్థాయికి ఎదగాలి

గిరిజన విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఐటీడీఏ డీడీ మణెమ్మ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు గంటగంటకూ పెరుగుతుంటాయి. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి తీసుకొచ్చి బేడా మండపంలో కొలువు దీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

14 నుంచి ఫాల్గుణ మాసోత్సవాలు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈ నెల 14 నుంచి ఏప్రిల్‌ 8 వరకు ఫాల్గుణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న మీన సంక్రమణం, చుట్టుసేవ, 15న సంధ్యాహారతి, 19న ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, 22న సంధ్యాహారతి, వసంతోత్సవం, డోలోత్సవం, 24న ఉత్సవ అంకురార్పణ, వాస్తుపూజ, హోమం నిర్వహిస్తామని వివరించారు. ఈనెల 25న స్వామివారి ఉత్సవమూర్తులకు విశేష స్నపన తిరుమంజనం, తలంబ్రాలు కలుపుట, ముత్తయిదువలతో పసుపు కొమ్ములు దంచడం, ఆ తర్వాత వసంతోత్సవం, డోలోత్సవం, రామయ్య కల్యాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేరోజున శ్రీమహాలక్ష్మి అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా అమ్మవారికి స్నపన తిరుమంజనం, సర్దలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, తిరువీధి సేవ నిర్వహిస్తారు. 27న సుదర్శన హోమం, ఏప్రిల్‌ 5న లక్ష కుంకుమార్చన, విశేష భోగ నివేదన, సంధ్యాహారతి, తిరువీధి సేవ వైభవంగా జరిపిస్తామని ఈఓ తెలిపారు.

సీఎం సభాస్థలి పరిశీలన



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్‌

బూర్గంపాడు: మండలంలోని లక్ష్మీపురంలో ఈనెల 11న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ నిర్వహించనుండగా ఎస్పీ రోహిత్‌రాజ్‌ బుధవారం సభాస్థలిని పరిశీలించారు. సభాస్థలికి చేరుకునేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని, ఇన్‌, ఔట్‌, వీఐపీ గేట్లు ఏర్పాటు చేయాలని పోలీస్‌ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్‌, సీఐ వినయ్‌కుమార్‌, ఎస్సై సుమన్‌, పీఏసీఎస్‌ మాజీ చైర్మన్‌ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్‌ వెంకటేశ్వరరెడ్డి, బాదం రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో గురువారం నుంచి శనివారం వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్‌ పాకాల వెంకటరమణ తెలిపారు. ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలను ఆయన బుధవారం వివరించారు. గురువారం మంగళతోరణాలంకరణ, గ్రామ సంకీర్తనం, యాగశాల ప్రవేశం, కాలభైరవ పూజ, వాస్తుహోమం, మండపారాధన, దీక్షాధారణ, శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి కల్యాణం, లింగోద్భవకాల అభిషేకం, హోమం, ప్రాతఃకాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఎదుర్కోలు, గ్రామోత్సవం, బలిహరణం, శనివారం స్వామివారికి త్రిశూల స్నానం, రథోత్సవము కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.


మాజీ మంత్రి జలగం పూజలు..

మాజీ మంత్రి జలగం ప్రసాదరావు స్వామివారిని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు వనమా గాంధీ, నాయకులు పర్సా వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, గాలం రాంబాబు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌లో కదలిక

ఏడాది కాలంగా ప్రకటనలకే పరిమితమైన గౌరెల్లి – కొత్తగూడెం జాతీయ రహదారి(ఎన్‌హెచ్‌ 930పీ)లో కదలిక వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా ఎన్‌హెచ్‌ 930పీ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



భూసేకరణ దశలో..

ఎన్‌హెచ్‌ 930పీ పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో గౌరెల్లి జంక్షన్‌ నుంచి వలిగొండ వరకు మొదటి ప్యాకేజీ ఉండగా ఆ తర్వాత వలిగొండ – తొర్రూరు – నెహ్రూనగర్‌ – కొత్తగూడెం వరకు మూడు.. మొత్తం నాలుగు ప్యాకేజీలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాకు సంబంధించిన పనులు నెహ్రూనగర్‌ – కొత్తగూడెం సెక్షన్‌లో వస్తున్నాయి. మొత్తంగా నెహ్రూనగర్‌ నుంచి ఇల్లెందు, టేకులపల్లి మీదుగా కారుకొండ వరకు 42 కి.మీ. పొడవుతో ఈ రోడ్డును నిర్మించాలని డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన భూమిని సేకరించే పనిలో ఎన్‌హెచ్‌ అధికారులు ఉన్నారు.

జిల్లాకు కొత్త జాతీయ రహదారి మంజూరు

- రెండేళ్ల క్రితం ప్రకటన, డీపీఆర్‌ పనులు పూర్తి
- మూడు దశల్లో భూసేకరణ ప్రక్రియ
- ఎన్‌హెచ్‌ 930పీ పనుల టెండర్ల దశలో తగ్గిన వేగం
- టెండర్లు పిలవాలంటూ ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి

35 కి.మీ తగ్గనున్న ప్రయాణం..

భద్రాచలం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం కొత్తగూడెం – ఖమ్మం – సూర్యాపేట మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఔటర్‌ రింగురోడ్డులో గౌరెల్లి జంక్షన్‌ నుంచి వలిగొండ – తొర్రూరు – మహబూబాబాద్‌ – ఇల్లెందు – కొత్తగూడెం మీదుగా భద్రాచలం వరకు ఎన్‌హెచ్‌ 930పీ పేరుతో కొత్త జాతీయ రహదారిని కేంద్రం రెండేళ్ల క్రితం ప్రకటించింది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం 35 కి.మీ.తగ్గుతుంది. అంతేకాక, హైదరాబాద్‌ నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలకు మరో మార్గం అందుబాటులోకి వచ్చినట్టవుతుంది.

నాలుగు వరుసలు..

ఎన్‌హెచ్‌ 930 పీ రోడ్డుకు సంబంధించి వలిగొండ నుంచి నెహ్రూనగర్‌ వరకు 125 కి.మీ. మార్గాన్ని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. ఇక పారిశ్రామిక ప్రాంతాలైన ఇల్లెందు – టేకులపల్లి – కొత్తగూడెంను కలిపే నెహ్రూనగర్‌ – కారుకొండ వరకు గల మార్గాన్ని నాలుగు వరుసలుగా నిర్మించాలని డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 826 కోట్లు ఖర్చవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. ఎన్‌హెచ్‌ 930పీ విషయంలో ఇప్పటికే డీపీఆర్‌ పూర్తయింది. భూసేకరణ ప్రక్రియ మొదలైంది. ప్యాకేజీల వారీగా పనులు మొదలుపెట్టడమే తరువాయి అన్నట్టుగా పరిస్థితి ఉంది. కానీ గడిచిన ఆరు నెలలుగా టెండర్ల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి కదలికా లేదు. తాజాగా టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌ విజ్ఞప్తి చేయడం గమనార్హం.

లక్ష్యం మూడేళ్లు..

ఎన్‌హెచ్‌ 930కి సంబంధించి ప్రస్తుతం అత్యంత రద్దీ మార్గంగా ఇల్లెందు – కొత్తగూడెం రూట్‌ ఉంది. సాధారణ వాహనాలకు తోడు పారిశ్రామిక అవసరాల కోసం లారీలు ఈ మార్గంలో ఎక్కువగా తిరుగుతున్నాయి. అందువల్లే ఈ సెక్షన్‌ను నాలుగు వరుసల మార్గాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత మూడేళ్లలో ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తయితే ఇల్లెందు పట్టణానికి పూర్తి స్థాయి బైపాస్‌రోడ్డులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండగా కొత్తగూడెం బైపాస్‌కు సంబంధించి కీలక సెక్షన్‌ ఈ ఎన్‌హెచ్‌ పరిధిలో ఉంటుంది.

భూసేకరణ నోటిఫికేషన్‌ వివరాలు

హైవే పనులు	నిడివి	గెజిట్‌ వచ్చిన తేదీ
నెహ్రూనగర్‌ – చల్లసముద్రం	11 కి.మీ	2023 మే 1
చల్లసముద్రం–ఉసిరికాయపల్లి	7 కి.మీ	2023 మార్చి 15
సుదిమల్ల – కారుకొండ	34 కి.మీ	2023 మే 1

‘రైతు నేస్తం’ను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ ప్రియాంక అల, పక్కన అధికారులు, నాయకులు

కలెక్టర్‌ ప్రియాంక అల

కొత్తగూడెంరూరల్‌: రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ ప్రియాంక అల అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు రైతు వేదికలో బుధవారం రైతునేస్తం కార్యక్రమాన్ని వర్చువల్‌ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక లాభాలు అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఒక రైతు వేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్చువల్‌ విధానంలో ప్రారంభించారని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, డీసీఎంఎస్‌ చైర్మన్‌ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం పీఏసీఎస్‌ చైర్మన్‌ హనుమంతరావు పాల్గొన్నారు.

స్పెషల్‌ డ్రైవ్‌ రెండురోజుల్లో పూర్తిచేయాలి

పాల్వంచరూరల్‌: ధరణి స్పెషల్‌ డ్రైవ్‌లో భాగంగా చేపట్టిన పెండింగ్‌ దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్‌ ప్రియాంక అల తహసీల్దార్‌ను ఆదేశించారు. పాల్వంచ తహశీల్దార్‌ కార్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. మండలంలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తహశీల్దార్‌ వివేక్‌ను ప్రశ్నించగా మొత్తం 282 దరఖాస్తులు ఉన్నాయని, విచారణ చేపట్టామని ఆయన సమాధానం ఇచ్చారు.

సీఎంతో మాట్లాడిన రైతు

దమ్మపేట : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండలంలోని మల్కారం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు బుద్దే కోటేశ్వరరావు తన పామాయిల్‌ క్షేత్రం నుంచి సీఎం రేవంత్‌ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడారు. లేత దశలో ఉన్న పామాయిల్‌ తోటలో అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుశనగ పండిస్తున్నానని, వాటిపై వచ్చే ఆదాయ, వ్యయ వివరాలను వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా రైతులు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం కల్పించడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖరరెడ్డి, ఏఈఓలు దీప్తి, అనుబాబు, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాల్‌ ద్వారా మాట్లాడుతున్న రైతు కోటేశ్వరరావు

‘గ్యారంటీ’ల అమలుకు ప్రత్యేకాధికారులు

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఐదు గ్యారంటీ పథకాల అమలుకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్‌ ప్రియాంక అల బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పినపాక నియోజకవర్గానికి డీఆర్డీఓ ఎం.విద్యాచందన, ఇల్లెందుకు ఎస్‌డీసీ జె.కాశయ్య, కొత్తగూడేనికి ఆర్డీఓ డి.మధు, అశ్వారావుపేటకు ఎస్‌డీసీ టి.సుమ, భద్రాచలం నియోజకవర్గానికి ఆర్డీఓ కె.దామోదర్‌రావును నియమించారు. ఇక మండలాల వారీగా ఆళ్లపల్లికి ఇరిగేషన్‌ ఈఈ టి.వెంకటేశ్వరరావు, అన్నపురెడ్డిపల్లికి ఎస్సీ అభివృద్ధి అధికారి డి.అనసూయ, అశ్వాపురానికి ఫిషరీస్‌ అధికారి బి.వీరన్న, అశ్వారావుపేటకు పశుసంవర్థక శాఖ ఏడీ ఎం.వెంకటేశ్వర్లు, భద్రాచలానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్‌, బూర్గంపాడుకు ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈ తిరుమలేష్‌, చండ్రుగొండకు మైనార్టీ అధికారి కె. సంజీవరావు, చర్లకు ఏడీఏ బి.సుధాకర్‌, చుంచుపల్లికి డీఐఈఓ సులోచనారాణి, దమ్మపేటకు ఆర్‌అండ్‌బీ డీఈఈ హరిలాల్‌, గుండాలకు డీసీఓ ఖుర్షీద్‌, జూలూరుపాడుకు డీఎస్‌ఓ పి. రుక్మిణీదేవి, కరకగూడేనికి మైన్స్‌ ఏడీ జైసింగ్‌, లక్ష్మీదేవిపల్లికి డీపీఓ వి. బాబూరావు, మణుగూరుకు డీఎంఓ ఎం.ఎ.అలీం, ములకలపల్లికి భూగర్భ జల శాఖాధికారి ఎం.బాలు, పాల్వంచకు పరిశ్రమల అధికారి జి.తిరుపతయ్య, సుజాతనగర్‌కు సివిల్‌ డీఎం ఎస్‌.త్రినాథ్‌బాబు, టేకులపల్లికి ఉపాధి కల్పనాధికారి వి.విజేత, ఇల్లెందుకు ఉద్యాన శాఖాధికారి కె.సూర్యనారాయణ, కొత్తగూడెం మండలానికి జిల్లా ఇరిగేషన్‌ అధికారి బి.అర్జున్‌ను నియమించారు.

పొగాకు వేలం ప్రారంభం

అశ్వారావుపేట: భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు చెందిన రైతులు సాగు చేసిన వర్జీనియా పొగాకు కొనుగోళ్లను ఏపీలోని జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో బుధవారం బోర్డు ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ అద్దంకి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ వేలంలో పొగాకు ప్రారంభ ధర కిలోకు రూ.240తో మొదలైంది. 2023–24 పంట కాలానికిగాను 2,776 మంది రైతులు 3,039.5 బ్యారన్లను రిజిస్ట్రేషన్‌ చేయించుకున్నారు. ఈ ఏడాది బ్యారన్‌కు 10.64 మెట్రిక్‌ కిలోల పొగాకును బోర్డు అనుమతి ఇవ్వగా 14.5 మెట్రిక్‌ కిలోల మేర ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు వేలం నిర్వహణాధికారి జె.సురేంద్రబాబు తెలిపారు. ఈ వేలంలో ఐటీసీ, జీపీఐతో పాటు మరో ఐదు కంపెనీలు పాల్గొంటుండగా, రైతు సంఘం నాయకులు వీవీఎస్‌ ప్రకాశ్‌రావు, సత్రం వెంకటరావు, ఆట్లూరి సతీశ్‌, కరాటం రెడ్డిబాబు, గద్దమణుగు సత్యనారాయణ, కూకలకుంట్ల కిశోర్‌ తదితరులు హాజరయ్యారు.



పొగాకు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఐక్య పోరాటాలే తక్షణ కర్తవ్యం

- ఫాసిస్ట్‌ పోకడలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం
- సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ నేతల ప్రకటన
- మహాసభల్లో ఆరు తీర్మానాల ఆమోదం, జాతీయ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన ప్రదీప్‌సింగ్‌ ఠాగూర్‌, సుభాష్‌దేవ్‌ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్‌: మూడు విప్లవ పార్టీల కలయికతో ఏర్పడిన సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ ద్వారా ఐక్య పోరాటాలే తక్షణ కర్తవ్యంగా ముందుకు సాగుతామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ ఠాగూర్‌, సంయుక్త కార్యదర్శులు పోటు రంగారావు, సుభాష్‌దేవ్‌ వెల్లడించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడు విప్లవ సంస్థలు కలిసి సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌గా ఏర్పడే క్రమాన ఖమ్మంలో మూడు రోజుల పాటు ఐక్యతా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం, నక్సల్బరీ తరహా విప్లవాత్మక ప్రజా పోరాటాలకు కేంద్రమైన ఖమ్మంలో నిర్వహించిన ఈ సభలు విజయవంతమయ్యాయని పేర్కొన్నారు. అన్ని ఫాసిస్ట్‌ వ్యతిరేక శక్తులతో కలిసి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ను ఓడించాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు నూతన ప్రజాస్వామిక విప్లవం, పార్టీ రాజ్యాంగం, రాజకీయ తీర్మానం తదితర ఆరు అంశాలను చర్చించి ఆమోదించినట్లు వెల్లడించారు. కాగా, ఐక్యతా మహాసభలు విజయవంతానికి సహకరించిన అందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్‌ కమిటీ ఏర్పాటు..

మాస్‌లైన్‌ సెంట్రల్‌ కమిటీని 21 మందితో ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. అలాగే తొమ్మిది మంది సభ్యులతో పొలిట్‌బ్యూరో, ముగ్గురు సభ్యులతో కంట్రోల్‌ కమిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు ప్రదీప్‌ సింగ్‌ ఠాకూర్‌ (పశ్చిమ బెంగాల్‌) ప్రధాన కార్యదర్శిగా, పోటు రంగారావు(తెలంగాణ), సుభాష్‌ దేబ్‌(త్రిపుర) సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయ్యారని, కంట్రోల్‌ కమిషన్‌ చైర్మన్‌గా రాయల చంద్రశేఖర్‌ ఎన్నికయ్యారని తెలిపారు.

ఆమోదించిన తీర్మానాలివే..

మహాసభల్లో ఆమోదించిన పలు తీర్మానాలను నేతలు వివరించారు. ఇజ్రాయిల్‌ చేసిన మారణహోమ దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలతో కలిసి నిలబడాలని, మణిపూర్‌లో ఫాసిస్ట్‌ బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్‌ చేసిన హింసను ఖండించాలని, జీఎన్‌.సాయిబాబాతోపాటు ఇతరులపై కేసును ముంబై కోర్టు కొట్టివేసిన నేపథ్యాన భారత ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేస్తూ తీర్మానించినట్లు చెప్పారు. అలాగే, సమాజంలోని శ్రామిక, కర్షకులు, అణగారిన వర్గాల వారి పోరాటాలకు అండగా నిలవాలని నిర్ణయించగా, యూఏపీఏ, ఏఎఫ్‌ఎస్‌పీఏ వంటి చట్టాలను వ్యతిరేకించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో కే.జీ.రాంచందర్‌, కె.రమ, అలేక్‌ చక్రవర్తి, దేవబ్రత శర్మ, దినేష్‌ గోహైన్‌, సంజయ్‌సింఘ్వీ, కెచ్చెల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రాయల చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో రెండు గంటలు నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ : కేటీపీఎస్‌ కాంప్లెక్స్‌ ఆరో దశలోని 11వ యూనిట్‌లో సాంకేతిక సమస్యతో బుధవారం ఉదయం 11 గంటలకు 500 మెగావాట్ల విద్యుత్‌ ఉత్పత్తి నిలిచిపోయింది. వెంటనే సీఈ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించి మధ్యాహ్నం ఒంటిగంటకు తిరిగి పునరుద్ధరించారు. అందుబాటులోకి వచ్చిన ఉత్పత్తిని రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

శాశ్వత ఉద్యోగాలిస్తేనే..

- సింగరేణి ఓసీకి భూములు ఇస్తాం
- మెరుగైన ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ వర్తింపజేయాలి
- మా డిమాండ్లకు అంగీకరించకపోతే వెళ్లిపోండి
- భూ సేకరణ గ్రామసభలో తేల్చి చెప్పిన తిర్లాపురం గ్రామస్తులు



ఉపాధి, అర్‌అండ్‌అర్‌ ప్యాకేజీలపై సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరిస్తూ మాట్లాడుతున్న తిర్లాపురం గ్రామస్తుడు

మణుగూరు టౌన్‌ : ఇప్పటికే సీతమ్మ సాగర్‌, రైల్వే ట్రాక్‌, ఓసీలకు వివిధ రకాలుగా భూములు కోల్పోయామని, తమ ప్రధాన డిమాండ్లను అంగీకరిస్తేనే భూములు ఇస్తామని తిర్లాపురం గ్రామస్తులు తేల్చిచెప్పారు. బుధవారం మణుగూరు ఓసీ విస్తరణకు భూ సేకరణలో భాగంగా తిర్లాపురం రైతువేదికలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ భూములు తీసుకుంటే సింగరేణి శాశ్వత ఉద్యోగం కల్పించాలన్నారు. తిర్లాపురం గ్రామం మొత్తం తీసుకోవాలని, మిగిలిన అరకొర భూమిలో నివాసం ఉండలేమని పేర్కొన్నారు. ఓసీలకు భూములు ఇచ్చి తీవ్రంగా నష్టపోయామని, తమకు న్యాయం చేసేందుకు అధికారులే వెనుకడుగు వేస్తున్నారంటూ చట్టాలను, ఇతర రాష్ట్రాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పులను గుర్తుచేస్తూ వివరించారు. తమ డిమాండ్లు అంగీకరించకపోతే ఇక్కడి నుంచి వెళ్లిపోండంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఒక్కో రైతుకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. తొలుత స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ సుమ మాట్లాడుతూ తీసుకోనున్న భూముల వివరాలు వెల్లడించారు. రైతులకు అన్యాయం చేయబోమని, స్థానికులకు స్కిల్‌ డెవలప్‌మెంట్‌ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉపాధికి దారి చూపుతామని అన్నారు. సింగరేణిలో ఔట్‌ సోర్సింగ్‌ ఉపాధి కల్పిస్తామన్నారు. భూ సేకరణ చట్టం పరిధిలో లోబడి జరుగుతుందని తెలిపారు.

ఔట్‌ సోర్సింగ్‌ ద్వారా ఉపాధి కల్పించాం : సింగరేణి జీఎం

సింగరేణి మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌ మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో స్థానికులకు ప్రైవేట్‌ కంపెనీల్లో ఔట్‌ సోర్సింగ్‌ ద్వారా 2,742 మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. మణుగూరు మున్సిపాలిటీ మొత్తానికి తామే నీటి సరఫరా చేస్తున్నామని అన్నారు. తిర్లాపురం గ్రామ సమస్యలు వివరిస్తే, సీఎస్‌ఆర్‌ నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ రాఘవరెడ్డి, డీటీ సునీతా ఎలిజబెత్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ లక్ష్మణ్‌, ఎంపీడీఓ తేల్లూరి శ్రీనివాసరావు, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, తిర్లాపురం పీసా ఉపాధ్యక్షుడు నర్సింహారావు, కార్యదర్శి స్వప్న, సింగరేణి అధికారులు రాజు, రమేశ్‌, షబ్బీరుద్దీన్‌, ఎంపీవో పల్నాటి వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌, మాజీ సర్పంచ్‌ పాయం కామరాజు, గ్రామస్తులు ఎడారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటూ నిబంధనలు మారిస్తే ఎలా..?

మేము సింగరేణికి భూములు ఇచ్చాం. ఉపాధి, సైడ్‌ డ్రెయిన్ల నిర్మాణం, తాగు నీటి సమస్య కోసం మమ్మల్ని గుర్తు పెట్టుకోరు. భూములు కోల్పోతే శాశ్వత ఉద్యోగాలు ఇవ్వడం కష్టమని అధికారులు చెబుతున్నారు. మరి బీటీపీఎస్‌ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఎలా ఇచ్చారో చెప్పాలి. తిర్లాపురంలో భూములు కోల్పోతున్న సుమారు 350 మందికి శాశ్వత ఉపాధి, 2వ షెడ్యూల్‌లో ఉన్న ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ఎందుకు ఇవ్వరో తేల్చాలి.

–కోడి నాగరాజు, స్థానికుడు

బలవంతపు భూ సేకరణ వద్దు

ఏజెన్సీలో పనిచేస్తున్న అధికారులకు ఇక్కడి ప్రత్యేక చట్టాలపై అవగాహన లేకపోవడం బాధాకరం. గ్రామసభకు సర్పంచ్‌ లేనప్పుడు ఊరి పెద్ద అధ్యక్షత వహించాల్సి ఉన్నా ప్రత్యేకాధికారి అధ్యక్షత వహించడమేమిటి. 5వ షెడ్యూల్‌లో పేర్కొన్నట్లు ఆదివాసీలమైన మాకు 2013 చట్టం ప్రకారం మెరుగైన ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ వర్తింపజేయాలి. భూ సేకరణలో ఎల్‌టీఆర్‌ చట్టాన్ని, సుప్రీం కోర్టులో గతంలో ఇచ్చిన సమతా జడ్జిమెంట్‌ను పరిగణనలోకి తీసుకోవాలి.

–సోడే రవి, పీసా మణుగూరు మండల అధ్యక్షుడు

ఊరు మొత్తం తీసుకోండి

ఉన్న కొద్దిపాటి పొలం తీసుకున్నాక మాకు ఉపాధి ఎలా ? మొదట ఊరు తీసుకుని తర్వాత మా పొలాలు తీసుకోవాలి. ఒకవైపు రైల్వే ట్రాక్‌, మరోవైపు బ్లాస్టింగులు, మరో వైపు గోదావరి ఇప్పుడు సింగరేణికి ఉన్న భూములు కూడా ఇచ్చి మేం ఇక్కడే ఉండి గుండె నొప్పి, అనారోగ్యాల బారిన పడలేం. పునరావాసం కల్పించి మా పిల్లలకు శాశ్వత ఉపాధి కల్పించి, ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ఇవ్వాల్సిందే. మా భూములు తీసుకుని మాకు అన్యాయం చేయొద్దు.

–పాయం కామరాజు, మాజీ సర్పంచ్‌

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు అందజేస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్య క్రమానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందజేశారు. హైదరాబాద్ మారేడుమిల్లికి చెందిన రాధాకృష్ణ దంపతులు రూ.లక్ష నిత్యాన్నదానానికి, వారి కుటుంబ సభ్యులు గూడెపు శివ, కిశోర్, శైలేంద్ర మరో రూ.లక్ష శాశ్వత పూజలకు గాను అందజేయగా అధికారులు స్వామి దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సాయిబాబు పాల్గొన్నారు.

రాయిగూడెంలో ఇసుక సీజ్

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చినరాయిగూడెం గ్రామంలో నిల్వ ఉంచిన ఇసుకను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చినరాయిగూడెం రెవెన్యూ – అశ్వాపురం మండలం శివారు రెవెన్యూకు చెందిన ఇసుకను రాయిగూడెంలో ఓ నిర్మాణం నిమిత్తం కొన్ని రోజులుగా నిల్వ చేశారు. ఇక్కడి నుంచి కొందరు ట్రాక్టర్ల ద్వారా రాత్రి సమయాల్లో తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాఘవరెడ్డి సీజ్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో డంప్‌గా ఉంచిన ఇసుకను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. కాగా డంప్ చేసిన ఇసుక 250 క్యూబిక్ మీటర్లు ఉండొచ్చని అధికారులు వెల్లడిస్తున్నారు.

జిలిటెన్ స్టిక్స్ నిర్వీర్యం

ఇల్లెందురూరల్: ఇటీవల పట్టుబడిన జిలిటెన్ స్టిక్స్‌ను మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ పూసపల్లి అడవుల్లో బుధవారం పోలీసులు నిర్వీర్యం చేశారు. మధ్యాహ్న సమయంలో పోలీసులు మూడు వాహనాల్లో గ్రామం మీదుగా అడవుల్లోకి వెళ్లడం, కొద్దిసేపటికే కాల్పుల మోత మాదిరిగా భారీ శబ్దం వినిపించడంతో పూసపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. చివరకు జిలిటెన్ స్టిక్స్ నిర్వీర్యం చేసినట్లుగా తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

బూర్గంపాడు: మండల పరిధిలోని లక్ష్మీపురం వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మహబూబాబాద్ నుంచి భద్రాచలం వస్తున్న ఆటోను వెనుక నుంచి ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న చిన్నూరు సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం భద్రాచలం, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మణుగూరు టౌన్: బొగ్గు అన్‌లోడ్ చేసి వస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రామానుజవరం గుట్ట సమీపంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. అచ్యుత్, పిచ్చయ్య అనే వ్యక్తులు మణుగూరు నుంచి బయ్యారం వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. ఈక్రమంలో ముందు ఉన్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో బీటీపీఎస్‌లో బొగ్గు అన్‌లోడ్ చేసుకుని మణుగూరు వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. మోటార్ సైకిల్ టిప్పర్ టైర్ల కింద పడి తునాతునకలయింది. చికిత్స నిమిత్తం అచ్యుత్‌ను భద్రాచలం ఆస్పత్రికి, పిచ్చయ్యను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

రూ.73 లక్షలకు ఐపీ దాఖలు

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు: పట్టణంలోని సాయిబాలాజీ హార్డ్‌వేర్, పెయింట్స్ అండ్ టైల్స్ వ్యాపారి కుంచల వెంకటేశ్వరరావు బుధవారం కొత్తగూడెం కోర్టులో ఐపీ దాఖలు చేశారు. వ్యాపారం నిమిత్తం తాను చేసిన అప్పులు, వడ్డీలు చెల్లించలేక మళ్లీ అప్పు చేయాల్సి వచ్చిందని, అప్పు చెల్లించలేక తాను రూ.73 లక్షలకు ఐపీ దాఖలు చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులుగా కొత్తగుండ్ల భాస్కర్‌తోపాటు మరో 42 మందిని చూపారు. న్యాయవాదులుగా గడిపల్లి మహేష్, కలవల సుధాకర్ వ్యవహరించారు.

జేసీబీ, ట్రాక్టర్లు స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని మారాయిగూడెం గ్రామంలో అక్రమంగా మట్టి తోలకాలు చేస్తున్న రెండు జేసీబీలు, మూడు ట్రాక్టర్లను బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

పశువుల పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా మూగజీవాలను కబేళాకు తరలిస్తున్న ఓ వ్యాన్‌ను బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. అశ్వారావుపేట సరిహద్దు చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో ఏపీలోని రాజమండ్రి నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు వ్యాన్‌లో పది ఆవులు, మూడు దుక్కిటెడ్లను తరలిస్తుండగా పట్టుకుని, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రవాణా చేస్తున్న కిల్లాడి దుర్గారావు, పెద్దిరెడ్ల గంగావరహాలు, గోర్ల శివలపై కేసు నమోదు చేశామని, పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పగిడిద్దరాజు జాతర ప్రారంభం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆరెం వంశీయులు
- డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ గద్దెలపైకి పగిడిద్దరాజు..


పగిడిద్దరాజును గద్దెల వద్దకు తీసుకొస్తున్న గిరిజనులు

గుండాల: మేడారం సమ్మక్క భర్త, యాపలగడ్డ గ్రామానికి చెందిన ఆరెం వంశీయుడు పగిడిద్దరాజు జాతర బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. యాపలగడ్డ గ్రామానికి చెందిన ఆరెం వంశస్తులు, పూజారులు, వడ్డెల ఆధ్వర్యంలో గ్రామంలోని పగిడిద్దరాజును, గుట్టనుంచి పడగల(జెండాలు)ను స్థానిక గద్దెల వద్దకు చేర్చారు. రాత్రి గర్భగుడి వద్ద ఆభరణాలకు, పడగలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలతో ఊరేగింపుగా పగిడిద్దరాజును గద్దెలపై ప్రతిష్ఠించి సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు.

గురువారం వనం(దేవత) రాకతో నిండు జాతర ప్రారంభమవుతుంది. సాయంత్రం జోగుకు వెళ్లి, రాత్రి దేవతలకు గంగాస్నానం చేయిస్తారు. దేవతలకు నాగవెల్లి జరుపుతారు. శుక్రవారం తెల్లవారుజామున గుడిమెలుగుతారు. ఉదయం నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. జాతరలో భారీగా దుకాణాలు వెలిశాయి. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పూజారులు అప్పయ్య, లక్ష్మినర్సు, లచ్చుపటేల్, పెద్ద కాంతారావు, చిన్న కాంతారావు, సత్యం, లక్ష్మయ్య, సమ్మయ్య, బిక్షం తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

గిరిజన విద్యార్థులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ మణెమ్మ

పాల్వంచరూరల్: గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చదువులో రాణిస్తూ క్రీడారంగంలోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ సూచించారు. కిన్నెరసాని, కాచనపల్లి క్రీడాపాఠశాలల్లో బాలబాలికలకు ప్రవేశాలు కల్పించేందుకు పాల్వంచ మండలం కిన్నెరసానిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది విద్యార్థులు హాజరు కాగా డీడీ పరిశీలించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి బి.గోపాల్‌రావు, గిరిజన వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లుతో పాటు ఏఎస్‌ఓలు, పీడీలు వెంకటనారాయణ, రాంబాబు, నాగేశ్వరరావు, రాంబాబు, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణారావు, రవి, వీరన్న, నాగరాజు, వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

మావోయిస్టులను తరిమికొట్టాలంటూ పోస్టర్లు


గుండాల: ప్రజాస్వామ్య ఆదివాసీ సంఘం పేరిట వెలిసిన పోస్టర్

నెట్‌వర్క్: 'మాయదారి మావోయిస్టులను తరిమికొడుదాం.. ఆదివాసీ మహిళల అభివృద్ధికి తోడ్పడదాం' అంటూ మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. బుధవారం ప్రజాస్వామ్య ఆదివాసీ సంఘం పేరిట గుండాల, దుమ్ముగూడెం, చర్ల, కరకగూడెం, పాల్వంచ, అశ్వాపురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో పోస్టర్లు వెలుగుచూశాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మావోయిస్టు దళం చెర నుంచి మహిళల విముక్తి కోసం, లింగవివక్ష, అత్యాచారాలు, వంటపని, బ్యాగుల మోత, నాయకుల వ్యక్తి గత పనులకు బానిసలుగా చూసే పద్ధతికి వ్యతిరేకంగా పోరాడుదామని పోస్టర్లలో పేర్కొన్నారు. విద్య, ఉద్యోగ వ్యాపార అవకాశాలను వినియోగించుకుని ప్రగతి సాధిద్దాం, మహిళా రిజర్వేషన్ ఉపయోగించుకుని మనమే పాలకులుగా మారుదామంటూ వివరించారు. ఈ పోస్టర్లను ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో, వాగుల బ్రిడ్జిల వద్ద గోడలకు అంటించారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

సుజాతనగర్: కోతుల దాడిలో ఓ చిన్నారికి గాయాలైన సంఘటన బుధవారం సుజాతనగర్‌లో చోటుచేసుకుంది. స్థానిక పాత పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ ఇంటి ఆరుబయట మూడేళ్ల చిన్నారి ఆడుకుంటుండగా ఒక్కసారిగా వచ్చిన కోతుల గుంపు దాడి చేసింది. దీంతో నడుంపై గాయాలుకాగా, చిన్నారి అరుస్తూ కేకలు వేయడంతో స్థానికులు గమనించి కోతులను తరిమికొట్టారు. కాగా విపరీతమైన కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

పశువులకు కృత్రిమ గర్భధారణతో లబ్ధి


దూడకు నట్టల మందు వేస్తున్న గోపాల్‌రెడ్డి

పాల్వంచరూరల్: పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం ద్వారా మేలు జాతి పశువులు జన్మిస్తాయని బైఫ్ సంస్థ రాష్ట్ర ముఖ్య అధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. పాల్వంచ మండలం పాండురంగాపురంలో బుధవారం మేలు జాతి దూడల ప్రదర్శన, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దూడలకు నట్టల మందు వేశాక గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కృత్రిమ గర్భధారణ వల్ల అధిక పాలోత్పత్తి కలిగిన పశువులు జన్మిస్తాయని తెలిపారు. అనంతరం ఐటీసీ బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ఆఫీసర్ సాగర్ మాట్లాడుతూ.. తమ సంస్థ తరఫున చేపట్టే కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మీరజ్‌తో పాటు హేమంత్, సదయ్య, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో రక్షణ చర్యలు పాటించాలి


మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్ రావు

పాల్వంచ : కర్మాగారాల్లో పనిచేసే సిబ్బంది రక్షణ చర్యలు పాటించాలని, విధుల్లో భద్రత ఎంతో కీలకమని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు, 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా కేటీపీఎస్ ఎంసీఆర్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల శ్రేయస్సు కూడా ముఖ్యమని అన్నారు. సమావేశంలో జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు, ఎస్‌ఈలు వి.వెంకటేశ్వర్లు, గుర్రం రాజ్‌కుమార్, టి.సత్యనారాయణ, ధర్మారావు, పి.కృష్ణ, బి.మోక్షవీర్, డివైసీసీ పి.రామారావు, ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ రత్నారావు, ఇన్‌స్పెక్టర్ రత్నారావు, డీఈ ఎస్.సమ్మయ్య, ఏడీఈ ఎస్.నాగయ్య, శేష సాయి, ఫైర్ ఆఫీసర్ వై.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ భాగం రాధాకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ నేతను హతమార్చిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఘటన


కైలాస్ నాగ్ (ఫైల్)

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బీజేపీ నాయకుడిని మావోయిస్టులు బుధవారం హతమార్చారు. జంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటమెట్ట ప్రాంతంలో మావోయిస్టు పార్టీ యాక్షన్ టీం సభ్యులు ట్రేడర్స్ సెల్ డివిజనల్ ఉపాధ్యక్షుడు కైలాస్‌నాగ్‌ను పదునైన ఆయుధాలతో నరికి చంపారు. కోటమెట్ట శివారులో కొత్త చెరువు నిర్మాణ పనులు చేస్తుండగా, అందుకు కైలాస్‌నాగ్‌కు చెందిన జేసీబీని వినియోగిస్తున్నారు. పనులు జరుగుతుండగా అక్కడికి చేరుకున్న మావోయిస్టులు అతడిని నరకడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అనంతరం మావోయిస్టులు జేసీబీని దగ్ధం చేశారు. అయితే ఈ ఘనటకు సంబంధించి పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

శ్మశానవాటికలో 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం

స్వాధీనం చేసుకున్న పోలీసులు


శ్మశాన వాటికలోని గదిలో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టేకులపల్లి: మండల పరిధిలోని తడికలపూడి రోడ్డులో ఉన్న దాసుతండా పంచాయతీ శ్మశానవాటికలో దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ టి.సురేష్, ఎస్‌ఐ సైదా రవూఫ్ కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు శ్మశాన వాటిక వద్ద భవనంలో తనిఖీలు చేపట్టారు. గది తాళం పగులగొట్టి 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా సుమారు 30 క్వింటాళ్ల మేర బస్తాలు రేషన్ షాపులకు సరఫరా చేసే ట్యాగులతో ఉండటం గమనార్హం. బియ్యం నిల్వ చేసింది రేషన్ డీలర్లా? వ్యాపారులు అనేది దర్యాప్తులో తేలనుంది.